బీఆర్ఎస్‌తోనే ముస్లింల సంక్షేమం

ఈద్ మిలాప్‌లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

ఈద్ మిలాప్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, మే 7: ముస్లింల సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం రాత్రి పటాన్‌చెరు జీఎమ్మార్ కన్వెన్షన్ హాలులో మైనార్టీ నేతలు ఈద్ మిలాప్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లింలకు పెద్దన్న కేసీఆర్ అని, ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడిన ముస్లింలను పదేండ్ల కాలంలో ఎంతో ప్రోత్సహించారన్నారు. వివిధ సంక్షేమ పథకాల్లో ప్రాధాన్యం ఇచ్చి గౌరవించారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రిజర్వేషన్లు తొలిగించి రాజ్యాంగాన్ని సవరించేందుకు ప్రయత్నిస్తున్నదని ఆరోపించారు. పటాన్‌చెరులో ముస్లింల ఖబ్రస్థాన్ కోసం ఐదు ఎకరాలు కేటాయించినట్లు తెలిపారు. అనంతరం ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, ముస్లిం మత ప్రభోదకుడు సిరాజ్ ఉర్ రెహమాన్, అల్లమా అహ్మద్ మాట్లాడుతూ నియోజకవర్గంలో కులమతాలకు అతీతంగా అన్ని వర్గాలు కలసిమెలసి ఉండేలా ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. బీఆర్ఎస్ మెదక్ లోక్‌సభ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి విజయానికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

గాలి అనిల్‌కుమార్‌ను గెలిపించాలి

- **జహీరాబాద్ పట్టణంలో ఎమ్మెల్యే మాణిక్‌రావు ఎన్నికల ప్రచారం**



జహీరాబాద్ పట్టణంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు

కోహీర్, మే 7: జహీరాబాద్ లోక్‌సభ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు అన్నారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలోని 1వ వార్డు, 24వ వార్డుల్లో డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, ఎన్నికల సమన్వయ కర్త దేవీప్రసాద్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండే గాలి అనిల్‌కుమార్‌కు ఓటు వేసి ఎంపీగా గెలిపించాలని కోరారు. కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఇద్దరు కూడా గతంలో ఎంపీలుగా పని చేశారని గుర్తు చేశారు. వారి పనితనం ఎలా ఉందో జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. ప్రజలకు ఏ మాత్రం పనికి రాని అలాంటి వారిని గెలిపించి మరోసారి తప్పు చేయొద్దని సూచించారు. కాంగ్రెస్ అమలు చేస్తామంటున్న గ్యారెంటీలను తెలంగాణ ప్రజలు ఎవరూ నమ్మడం లేదన్నారు. కాంగ్రెస్‌కు ఓటుతో గుణపాఠం చెప్పాలన్నారు. పింఛన్ రూ.4వేలు, మహిళలకు రూ.2,500, నిరుద్యోగ భృతి రూ.4వేలు, రుణమాఫీ రూ.2లక్షలు, కౌలు రైతులకు రూ.12వేలు, తులం బంగారం ఏ ఒక్కరికైనా ఇచ్చారా అని ప్రశ్నించారు. గాలి అనిల్‌కుమార్ గెలిస్తే ఎంపీ నిధులతోపాటు ఎమ్మెల్యే నిధులతో జహీరాబాద్‌ను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ నామ రవికిరణ్ గుప్తా, షేక్ ఫరీద్, అబ్దుల్లా, బండిమోహన్, మంజుల, బరూర్ దత్తాత్రి, రమేశ్, సురేశ్, బాలరాజు, మల్లికార్జున్, శివాజీ, పూలమ్మ, పద్మజ, శేఖర్, మోయిన్, నిజాం, కృష్ణ పాల్గొన్నారు.

దేవునిగుట్టతండాలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

సిరిపురలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన నాయకులతో ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

కాంగ్రెస్‌వి మోసపూరిత హామీలు

- **ఆరు గ్యారెంటీలను అమలు చేసేవరకూ కొట్లాడుతాం**
- **ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**

హత్నూర, మే 7: మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్‌ను నమ్మే స్థితిలో నేడు తెలంగాణ ప్రజలు లేరని, ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం హత్నూర మండలం దేవునిగుట్టతండా, సిరిపుర, తెల్లరాళ్లతండా, గోవిందరాజ్‌పల్లి, చీక్‌మద్దూర్, కొన్యాల, హత్నూర తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆచరణలో సాధ్యం కాని హామీలిచ్చి పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం మాత్ర మే కల్పించిందని, అందులో కూడా బస్సుల సంఖ్యను తగ్గించి ప్రయాణిలను ఇబ్బందులకు గురిచేస్తున్నదని ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలను బెదిరింపులకు గురిచేస్తూ కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారని, అలావెళ్లిన వారు తిరిగి బీఆర్ఎస్‌లోకి వస్తున్నారని చెప్పారు. గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదన్నారు. అక్కడక్కడ కురుస్తున్న వర్షాలకు చేతికొచ్చిన ధాన్యం తడిసి తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలుచేసేవరకు ప్రజలపక్షాన ప్రభుత్వంతో కొట్లాడతామని తేల్చిచెప్పారు. మెదక్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి కలెక్టర్‌గా పని చేసిన అనుభవం ఉందని, చదువుకున్న విద్యావేత్త, ధనవంతుడు ప్రజాసేవకు ముం దుకువచ్చారన్నారు. కారుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీజేపీ మతం పేరుతో, కాంగ్రెస్ కులం పేరుతో మోసం చేస్తున్నాయని ఆరోపించారు.

కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి..

సిరిపుర, గోవిందరాజ్‌పల్లి గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. తెలంగాణ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి గెలుపునకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో లేబర్ వెల్ఫేర్ బోర్డు మాజీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, ఎంపీపీ నర్సింహులు, నాయకులు దామోదర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నర్సింహారెడ్డి, రవికుమార్, నరేందర్, చెన్న నర్సింహులు, వీరేశంగౌడ్, కృష్ణగౌడ్, కిశోర్, ఇబ్రహీం, నగేశ్‌గౌడ్, అజ్మత్‌అలీ, ప్రతాప్‌రెడ్డి, ఎల్చాల మధు, సురేందర్‌రెడ్డి, నరోత్తంరెడ్డి, మాణిక్యరెడ్డి, శ్యాం, రవీందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి

మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

వట్‌పల్లి, మే 7: ఈ నెల 13న జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటుతో తగిన బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ పిలుపునిచ్చారు. మంగళవారం పోతులబొగుడలోని ఆయన స్వగృహంలో పార్టీ గ్రామ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని సరిగా నెరవేర్చలేదని, 5 నెలల్లోనే పాలన అస్తవ్యస్తంగా మారిందన్నారు. సీఎం రేవంత్ ప్రభుత్వ తీరుపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, మళ్లీ కేసీఆర్ పాలన కావాలంటున్నారని చెప్పారు. అసత్యాలు, అబద్ధాలతో గద్దెనెక్కిన సీఎం రేవంత్‌రెడ్డి నోటి దురుసు తగ్గించుకోకపోతే ప్రజల చేతిలో ఓటమి తప్పదన్నారు. కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలంటే కారు గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. పోతులబొగుడలో భారీ మెజార్టీ వచ్చేలా పార్టీ నాయకులు పనిచేయాలని కోరారు. సమావేశంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు శేఖర్, రాజు, శ్రీకాంత్, అనిల్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సంక్షేమాన్ని గాలికొదిలేసింది

బీఆర్ఎస్ శ్రేణులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నాగల్‌గిద్ద, మే 7: రాష్ట్రానికి కేసీఆరే శ్రీరామరక్ష అని, ఆయన హయాంలోనే అన్ని వర్గాల ప్రజలు సఖ సంతోషాలతో ఉన్నారని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అన్నారు. మగళవారం మండలంలోని షాపూర్, మోర్గి నాగల్‌గిద్ద, ఎర్రభోగడా, తదితర గ్రామంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్, బీజేపీలకు ఓటేస్తే బతుకులు ఆగమైతయన్నారు. బీబీ పాటిల్ కాదు ఆయన బిజినెస్ పాటిల్ అని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు పండరి, నందు పాటిల్, ప్రహ్లాద్, లక్ష్మణ్‌నాయక్ ఉన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డిని శాలువాతో సన్మానిస్తున్న నాయకులు

నారాయణఖేడ్/కల్హేర్/నాగల్‌గిద్ద, మే 7: మండల కేంద్రంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. భూపాల్‌రెడ్డి చేతుల మిదుగా కేక్ కట్ చేయించి శాలువాలతో సన్మానించి స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భూపాల్‌రెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ఎంతో కృషి చేశానని, ఊపిరి ఉన్నంత వరకు తన జీవితం ప్రజాసేవకే అంకితమని చెప్పారు. పదవి ఉన్నా లేకపోయినా ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

అందోల్, మే 7: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా నలుగురు గాయపడిన ఘటన మండల పరిధిలోని అల్మాయిపేట్ శివారులో మంగళవారం జరిగింది. ప్రమాదానికి సంబంధించి జోగిపేట ఎస్సై అరుణ్‌కుమార్‌గౌడ్ తెలిపిన వివరాలు.. పెద్ద శంకరంపేట్‌కు చెందిన ఎర్రొల సంగాగౌడ్(55) భార్య అంజమ్మ కొడుకు అర్వింద్‌తోపాటు వారి బంధువులు మంజుల, మానసలతో కలిసి అంజమ్మకు ఆరోగ్య పరీక్షలు చేయించేందుకు కారులో సంగారెడ్డి వెళ్తున్నారు. వారు ప్రయాణిస్తున్న కారు అల్మాయిపేట్ వద్దకు రాగానే టైర్ పంక్చర్ అయి అదుపు తప్పి డివైండరును ఢీకొట్టింది. దీంతో సంగాగౌడ్, అంజమ్మ, అర్వింద్‌లకు తీవ్ర గాయాలు కాగా, మంజుల, మానసకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను 108 వాహనంలో సంగారెడ్డికి తరలించగా చికిత్స పొందుతూ సంగాగౌడ్ మృతి చెందాడు. అంజమ్మ, అర్వింద్‌ల పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం వారిని హైదరాబాద్ తరలించారు. మంజుల, మానస ఇద్దరు సంగారెడ్డి ప్రైవేట్ దవాఖానలో చికిత్స పొందుతున్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యా దు మేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్సై తెలిపారు. ప్రమాద స్థలంలో కారు డోర్ పూర్తిగా లాక్ అవడంతో డ్రైవర్‌తో పాటు పక్కనే ఉన్న మరో వ్యక్తిని బయటకు తీసేందుకు చాలా సమయం పట్టింది.

ప్రచార హోరు.. గులాబీ జోరు

ఎంపీ ఎన్నికల ప్రచార గడువు దగ్గరపడుతున్న కొద్దీ బీఆర్ఎస్ శ్రేణులు జోరు పెంచారు. గడపగడపకూ వెళ్తూ కారుకు ఓటేసి తమ అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు. బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి, జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా ప్రచారాన్ని ముమ్మరం చేశారు. మంగళవారం ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ, కరపత్రాలు పంచుతూ బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, మే 7

అందోల్: జోగిపేటలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఆర్సీపురం: ఓట్లు అభ్యర్థిస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్

గుమ్మడిదల: అనంతారం గ్రామంలో బీఆర్ఎస్ ప్రచారం

అమీన్‌పూర్‌లో ఎన్నికల ప్రచార ర్యాలీ

బొల్లారం: ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సతీమణి గూడెం యాదమ్మ, ఎంపీ అభ్యర్థి సతీమణి ప్రణీత



జిన్నారం: మంగంపేటలో బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరుతున్న జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, వెంకటేశంగౌడ్

దంచికొట్టిన వాన.. అన్నదాత ఆగమాగం

జిల్లాలో మంగళవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. చినుకుచినుకుగా మొదలై ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. రోడ్లు, కల్లాలు, మైదానాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయింది. ఇక అమ్ముదామనుకున్న ధాన్యం కల్లెదుటే తడిసిపోవడంతో రైతులు బోరున విలపించారు. పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. భారీ చెట్లు నేల కూలాయి. ఇన్ని రోజులు ఉక్కపోత, వేడిని తట్టుకోలేకపోయిన ప్రజలు వాతావరణం చల్లబడడంతో ఊపిరి పీల్చుకున్నారు. గడ్డపోతారం, ఖాజీపల్లి, బొల్లారం పారిశ్రామిక వాడల్లో పరిశ్రమలు రసాయన వ్యార్థాలను వన నీటిలోకి వదలడంతో చెరువులు, కుంటల్లోకి కాలుష్యం వచ్చి చేరింది. బొల్లారంలో వడగండ్ల వాన కురిసింది. హత్నూరలో భారీ గాలులకు మామిడి కాయలు నేలరాలడంతో తీవ్ర నష్టం వాటిల్లింది.

- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, మే 7

అందోల్: జోగిపేట వ్యసాయ మార్కెట్లో తడిసిన ధాన్యం

హత్నూరలో నేలకొరిగిన రేకులషెడ్డు

జిన్నారం: మినీ స్టేడియంలో వానకు తడిసిన ధాన్యం

రామచంద్రాపురం: భెల్‌లో విరిగిన చెట్లు

గుమ్మడిదల: కురుస్తున్న భారీ వర్షం

హత్నూర: తడిసిన బస్తాల్లో నింపిన ధాన్యం.. బయటకు వస్తున్న నీరు

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి

హత్నూర, మే 7: వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతిచెందిన ఘటన హత్నూర మండలంలో చోటుచేసుకుంది. నవాబుపేట గ్రామానికి చెందిన వెంకట్(20) సోమవారం రాత్రి బైక్‌పై వెళ్తూ గోవిందరాజ్‌పల్లి శివారులో రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గోవిందరాజ్‌పల్లి గ్రామానికి చెందిన మోదుగుల అనసూజ(50) మంగళవారం పాముకాటుకుగురి కాగా చికిత్సని మిత్తం సంగారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించే క్రమంలో మార్గమధ్యలో మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుభాష్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

న్యాల్‌కల్, మే 7: మండలంలోని న్యామతాబాద్ శివారులో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు హద్నూర్ ఎస్ఐ రామనాయుడు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గ్రామ శివారులో అప్పారావుపాటిల్ పొలం వద్ద కుర్జువాగు గుంతలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కుళ్లిపోయి కనిపించడంతో స్థానిక రైతులు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయస్సు 25-39 మధ్య ఉంటుందని, వ్యక్తి మృతదేహంపై తెల్లని షర్టు, జీన్స్ ప్యాంటు ధరించి ఉందన్నారు. మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

కార్మికులకు అండ బీఆర్ఎస్

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు, మే 7: కార్మికులకు అండగా నిలిచే పార్టీ బీఆర్ఎస్ అని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్‌చెరు పట్టణంలో జీఎంఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్మిక సంఘాల మీడియా సమావేశానికి హాజరై మాట్లాడారు. పదేండ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వ విధానాలతో కార్మికరంగం ఘోరం గా దెబ్బతిన్నదన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో 12 గంటల పనివిధానం ప్రారంభమైందన్నారు. కార్మికులకు శాపంగా మారిన లేబర్ కోడ్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయాంలో రాష్ట్రంలో వేలాది పరిశ్రమలు వచ్చాయని, లక్షలాది మందికి ఉద్యోగాలు కల్పించామన్నారు. బుధవారం నిర్వహించనున్న మాజీ సీఎం కేసీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇస్నాపూర్ చౌరస్తా నుంచి ముత్తంగి మీదుగా పటాన్‌చెరు వరకు భారీ ర్యాలీ ఉంటుందన్నారు. దాదా పు 50వేల మందితో రోడ్ షో ఉంటుందని, భారీ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ ఎంఎస్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఆర్ ఈశ్వర్ ప్రసాద్, అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, కార్మిక సంఘాల నాయకులు ఈశ్వర్ ప్రసాద్, నర్రా భిక్షపతి, మాధవరావు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు కౌలు రైతు మృతి

పాపయ్య(ఫైల్)

అందోల్, మే 7: పిడుగుపాటుకు కౌలు రైతు మృతి చెందిన ఘటన అందోల్ మండలం ఎర్రారం గ్రామంలో మంగళవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన బోయిని పాపయ్య(53) కొంత భూమిని కౌలుకు తీసుకొని పంట సాగుచేస్తు భార్య, కొడుకుతో కలిసి ఉంటున్నాడు. మంగళవారం రాత్రి పొలం నుంచి పశువులను తోలుకొని ఇంటికి వస్తున్న సమయంలో ఈదురుగాలులు, మెరుపులతో కూడిన వర్షం రావడంతో అక్కడే చెట్టుకింద కూర్చున్నాడు. అదే సమయంలో భారీ శబ్దంతో పిడుగు పడడంతో పాపయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. పిడుగుపాటుకు మృతుడి జేబులో ఉన్న సెల్ ఫోన్ సైతం పేలడంతో తీవ్రంగా రక్తస్రావం అయింది. పాపయ్య మృతితో భార్య, కొడుకు దిక్కులేని వారయ్యారు. మృతుడి కుటుంబాన్ని మాజీ సర్పంచ్ ప్రవీణ్‌రెడ్డి పరామర్శించారు.